

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



**జబ్ దిల్ హీ టూట్ గయా హం జీ కే క్యా కరేంగే...**

అమరగాయకుడు కుందన్ లాల్ సైగల్ పేరు తలవగానే గుర్తుకు వచ్చేపాట ఇది. విషాదం అనగానే మనసులో మెదిలే పాట ఇది. భగ్న ప్రేమ అనగానే హృదయం తలిచే గీతం ఇది. 'మనసు విరిగిపోయింది' అనగానే మది పాడే గీతం ఇది. సైగల్ తన సినీ సంగీత జీవితంలో దాదాపుగా 189 పాటలు పాడాడు. ఎన్నో పాటలు సూపర్ హిట్ అయి ఈనాటికీ వినిపిస్తూనే ఉన్నాయి. కానీ జబ్ దిల్ హీ టూట్ గయా' అంటే సైగల్, సైగల్ అంటే 'జబ్ దిల్ హీ టూట్ గయా' గా స్థిరపడిపోయింది. విషాద గీతాలకు తలమానికంగా నిలుస్తుంది ఈ పాట.

'షాహజహాన్' సినిమాలోని ఈ పాటకు బాణీ కుదిర్చింది నౌషాద్. పాటను రచించింది మజ్రూహ్ సుల్తాన్ పురి. ఈ పాట ఒక రకంగా చెప్పాలంటే హిందీ సినీ సంగీత చరిత్రలోనే అపురూపమైన పాట. మరపుకు రాని పాట. తాగందే పాడలేనని నమ్మే సైగల్ తాగకుండా పాడించి రికార్డు చేసి, తాగిన తరువాత పాడించి రికార్డు చేసి, తాగనప్పుడే సైగల్ అద్భుతంగా పాడతాడని నౌషాద్ నిరూపించిన పాట ఇది. హిందీ సినీ గీత రచన రంగంలో నూతన ఒరవడికి మజ్రూహ్ శ్రీకారం చుట్టిన పాట ఇది. కవితను గీతంతో ముడివేసి సినీగీతానికి సాహిత్య గంధం పూయటానికి నాందీ ప్రస్తావనలాంటి పాట ఇది. అలతి అలతి పదాలలో గంభీరమైన భావాల్ని పొదిగి తేలికగా అనిపించే పాటలోని విషాదపు బరువు మనసు మాత్రం గ్రహించేట్టు సృజించిన పాట ఇది. ఈ పాట సైగల్‌కు సైతం ఎంతగా నచ్చిందంటే తన అంత్యక్రియల సమయంలో ఈ పాటను నేథ్యంలో వినిపించాలని సైగల్ కోరేంతగా . ఎందుకంటే అప్పటికే తన మరణం దగ్గర పడిందని సైగల్‌కు తెలుసు. అది ఈ పాటను మరింతగా బాధామయం చేస్తుంది.

'షాహజహాన్' సినిమాతో సంబంధం ఉన్న ముగ్గురు కళాకారులకు భవిష్యత్తులో దాదాఫాల్కే అవార్డు లభించటం సినీ రంగంలో ఈ సినిమా ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తుంది. పాటను రచించిన మజ్రూహ్ సుల్తాన్ పురి, సంగీత దర్శకత్వం వహించిన నౌషాద్‌లతో పాటు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన పైడి జయరాజ్‌కు కూడా దాదాఫాల్కే అవార్డు లభించింది.

'హృదయం పగిలిపోయిన తరువాత జీవించి ఏం లాభం?' అంటూ ఆరంభమవుతుంది పల్లవి. చాలా సులువుగా, వినగానే మనసులో స్థిరపడిపోతాయి పాటలో పదాలు. ఆ తరువాత పదాల భావం ఒక్కసారిగా ఎదను బలంగా తాకుతుంది. నిజం, హృదయం పగిలి ముక్కలయిన తరువాత జీవించి లాభం ఏముంది? ముఖ్యంగా సైగల్ 'హం జీ కే క్యా కరేంగే' అని అడగటం ఎంత విషాదంగా ఉంటుందంటే, నిజంగా హృదయం వెయ్యి ముక్కలయిన భావన కలుగుతుంది.

**తేరి దునియా మె దిల్ లగ్తానహీ వాపస్ బులాలే**

**మై సజ్ దేమే గిరాహూ, ముఝూ కొ ఏయ్ మాలిక్ ఉఠాలే.**

'బావ్రేనైన్' సినిమాలో కేదార్ శర్మ రచించగా, రోషన్ సంగీత దర్శకత్వంలో ముకేష్ అత్యద్భుతంగా పాడిన పాట ఇది. విషాద గీతాలు పాడటంలో సైగల్ బాటలో ప్రయాణిస్తూ తనదైన ప్రత్యేక గాన సంవిధానాన్ని ఏర్పాటు చేసుకుని సినీ సంగీత ప్రేమికుల హృదయాల్లో సైగల్ సరసన నిలిచాడు ముకేష్. విషాద గీతాలను పాడుకోవటంలోని ఆనందాన్ని ఈ రెండు పాటలు ప్రస్ఫుటం చేస్తాయి. పాటల బాణీలు ఎంతో సులువుగా ఉంటాయి. ఎక్కడా రాగాలు, దీర్ఘాలు, ఆరోహణ, అవరోహణలు ఉండవు. మంద్ర స్థాయిలో వ్యక్తులు తమలో తాము విషాదంలో కుములుతూ, జీవితంపై విరక్తి చెంది ఇక ఈ ప్రపంచంలో జీవించి లాభం లేదని, మరణాన్ని కోరుతూ పాడేటటువంటి పాటలు ఇవి.

సైగల్ పాటలో 'బ్రతికి లాభం ఏమిటి, బ్రతికి ఏం చేస్తాను' అన్న విషాదం, విరక్తి భావనలు ఉంటే, ముకేష్ పాటలో విషాదం, విరక్తిల మరో రూపు కనిపిస్తోంది. భగవంతుడు సృష్టించిన ఈ ప్రపంచం మన హీరోకి నచ్చటం లేదు. అందుకే నీ ప్రపంచం నాకు నచ్చలేదు. ఇక్కడ ఉండబుద్ధికావటం లేదు. కాబట్టి నిన్ను ప్రార్థిస్తున్నాను. సజ్దే అన్నది ముసల్మానులు ప్రార్థన చేసే పద్ధతి. మోకాళ్ళపై కూచుని, నుదురును నేలపై ఆనించటం అన్నమాట. సజ్దా చేయటం అంటే పూర్తిగా తనని తాను సమర్పించుకోవటం, అర్పించుకోవటం..మన సాష్టాంగ ప్రమాణం లాంటిది. అలా సజ్దా చేస్తున్నాను. నన్ను లేపు..అంటే ఉద్ధరించు... నన్నీ ప్రపంచం నుంచి తీసుకు వెళ్లిపో అని బ్రతిమిలాడుతున్నాడు హీరో.

సినిమాల్లో విషాద పాటలలో ఈ రకమైన పాటలది ప్రత్యేకమైన కేటగిరీ. విరక్తి పాటలు ఇవి. బ్రతకాలన్న కోరిక నశిస్తుంది. జీవేచ్ఛ నశిచిన వ్యక్తి ఇక ఈ ప్రపంచంతో నాకు పనిలేదు అని ఎక్కడికో వెళ్లిపోవాలని అనుకుంటాడు. ప్రపంచం వదిలి పోవాలనుకుంటాడు.

అందరికీ దూరంగా ఒంటరిగా ఉందామనుకుంటాడు. తీవ్రమైన నిరాశను ప్రతిఫలిస్తాయి ఈ పాటలు. కానీ ఈ పాటలను వింటూ, పాడుకుంటూ, పాటలలోని విషాద భావాన్ని అనుభవిస్తూంటే విషాదపు అంచులనుండి ఆనందంపు పొలిమేరలలోకి అడుగుపెడతాం. విరక్తి లోతులలోంచి ఆనందపు శిఖరాల వైపు అడుగులేస్తాం. అంటే ఎంతగా విషాదపు లోతుల్లోకి చేరుకుంటాం అంటే, వెళ్లేందుకు పైకి తప్ప మరోదారి ఉండదు. విషాదం లోతులు చూసిన తరువాత ఇక ఆనందపు ఎత్తులు అధిరోహించటం తప్ప మరో మార్గం ఉండదు. ఈ పాటలు విషాదాంధకారాలలోతులకు తీసుకు వెళ్తాయి. అటునుంచి వెలుగువైపు నడిపిస్తాయి.

**ఏయ్ దిల్ ముఝె ఐసీ జగాహ్ లేచల్ జహా కోయీ నహో**

**అప్‌నా పరాయా మెహర్‌బానా, మెహెర్‌బాన్, కోయీ నహో.**

నిలువెల్లా విరక్తి ఈ పాట. ఆర్జూ సినిమాలో అనిల్ బిశ్వాస్ సంగీత దర్శకత్వంలోని ఈ పాటతో తలత్ మహమూద్ హిందీ సినీ సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. హీరో తన హృదయాన్ని తనని ఎలాంటి ప్రదేశానికి తీసుకు వెళ్లమంటున్నాడంటే, అక్కడ ఎవ్వరూ ఉండకూడదట. తన వాళ్లు, పరాయి వాళ్లు తనపై జాలి చూపించేవాళ్లు, సానుభూతి కురిపించేవాళ్లు ఎవ్వరూ ఉండకూడదట. మజ్రూహ్ రచించిన మరో అద్భుతమైన గేయం.

**ఏయ్ మెరే దిల్ కహీ ఔర్ చల్,**

**గం కి దునియా సె దిల్ భర్ గయా**

**ఢూంఢ్ లే అబ్ కొయీ ఘర్ నయా!**

'దాగ్ ' సినిమాలో శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో తలత్ మహమూద్ పాడిన శైలేంద్ర గీతం విషాదంలోని ఆశను చూపిస్తుంది. విషాదం నిండిన ఈ ప్రపంచంపై అతడి మనస్సు విరిగిపోయింది. కాబట్టి తన హృదయాన్ని ఎటో పొమ్మంటున్నాడు. ఇక్కడ ఉండవద్దు. మరో కొత్త ప్రదేశానికి పోదామంటున్నాడు. ఈ పాట సినిమాలో మూడుసార్లు వస్తుంది. రెండు సార్లు తలత్మ హమూద్, ఒక్కసారి లత పాడుతుందీ పాటను. అయితే ఈ విషాద గీతాన్ని భైరవి రాగంలో అత్యంగ వేగవంతమైన బాణీతో రూపొందించి మురిపించాడు శంకర్‌జైకిషన్. వినగానే

మనసుకు పట్టే పదాలు దానికి తగ్గ బాణీ. అతి విషాదం ఉట్టిపడే గానంతో పాట కట్టిపడేస్తుంది. ఎంతగా పాడుకుంటే అంతగా విషాదం ఉబికి ఉబికి వస్తుంది. కానీ అంతగా సాంత్వన లభిస్తుంది.

**తెరీ దునియా మె జీ నేసే తొ బెహతర్ హై కె మర్ జాయే**

**వహీ ఆసూ, వహీ ఆహే, వహీ గం హై జిధర్ జాయే.**

సాహిర్ లూధియాన్వీ రచించిన 'ఘర్ నెం 44' లోని ఈ పాటను హేమంత్ కుమార్ పాడాడు. పాటలో పదాలు స్పష్టంగా ఈ ప్రపంచంపై విరక్తిని ప్రకటిస్తున్నాయి. ఈ ప్రపంచంలో బ్రతకటం కన్నా చావటం మేలు. అవే బాధలు, అవే కన్నీళ్లు, అవే వేదనలు ఎటు చూసినా. ఇలాంటి ప్రపంచంలో జీవనం కన్నా మరణం మేలు అంటున్నాడు సాహిర్. ఈ పాటను హేమంత్ కుమార్ పాడటంతో పాటలో విషాదం మరింత తీవ్రమవుతుంది.

**యే దునియా, యే మహఫిల్ మెరె కాం కీ నహీ..**

కైఫీ ఆజ్మీ రచించిన పాట ఇది. హీర్ రాంఝా సినిమాలో మహమ్మద్ రఫీ పాడిన పాట. నాయకుడికి మనసు విరిగిపోయింది. ఈ ప్రపంచం, ఇక్కడి సమాజంతో తనకేం పనిలేదు పొమ్మంటున్నాడు నాయకుడు. మదన్ మోహన్ అత్యంత సుందరమైన రీతిలో ఈ పాటను రూపొందించాడు. గమనిస్తే ఈ పాటలన్నీ దుర్భరమైన విషాదాన్ని ప్రదర్శిస్తాయి. విరక్తిని ప్రదర్శిస్తాయి. విరక్తికి పరాకాష్ఠ ఈ పాటలు. ఇక ప్రపంచంలో బ్రతికి లాభం లేదు అని నిశ్చయానికి రావటాన్ని మించిన విషాదం ఇంకొకటి లేదు. ఈ పాటలలో హీరో మనసు ఎందుకు విరిగిపోయిందంటే ప్రేమ వైఫల్యం వల్ల. కానీ కొన్ని పాటలలో ఏయ్ మెరే దిల్ కహీ ఔర్ చల్, తెరీ దునియామె జీనేసే వంటి పాటలలో హీరోకి విరక్తి కలిగింది ప్రేమ వైఫల్యం వల్ల కాదు, ప్రేమ రాహిత్యం వల్ల.

**దుఖీ మన్ మెరే, సున్ మేరా కహెనా**

**జహాఁ నహీఁ చైనా, వహాఁ నహీ రహెనా**

'మనసుకు శాంతిలేని చోట ఉండకూడదు. కాబట్టి ఓ నా విషాద హృదయమా నా మాట విను మనం ఇక్కడనుంచి వెళ్లిపోదాం' అంటున్నాడు సాహిర్, కిషోర్ కుమార్ గొంతుతో, ఎస్డీ. బర్మన్ బాణీని అనుసరించి 'ఫంటూష్ ' సినిమాలో.

సాహిర్ కానీ శైలేంద్ర కానీ 'ప్రేమనే జీవితం' అని నమ్మేవారు కారు. ప్రేమ కాక మనిషికీ మనిషికీ నడుమ ఇంకేదో అపురూపమైన సంబంధం ఉందని నమ్మారు. అందుకని ప్రేమ వైఫల్యంతో ప్రపంచం పై విరక్తి తెచ్చుకుని, అన్నీ వదిలేసి పోవటం ఈ ఇద్దరు గేయ రచయితల సిద్ధాంతానికి వ్యతిరేకం. సాహిర్ అయితే ప్రేమ అన్నది ఒక బూటకం అని నమ్ముతాడు. అందుకని ఈ ఇద్దరు గేయ రచయితలు రాసిన విరక్తి పాటల్లో విరక్తికి కారణం వ్యక్తిగత ప్రేమ కాదు.

**ఉల్ఫత్ కా దియా హం నే జిస్ దిల్ మే జలాయాథా**

**ఉమ్మీద్ కే ఫూలోం సే జిస్ ఘర్ కో సజాయాథా**

**ఎక్ భేదీ లూట్ గయా.**

'జబ్ దిల్ హీ టూట్ గయా' పాటలో నాయకుడి విషాదానికి కారణం ఇది. ప్రేమ దీపాన్ని తన హృదయంలో వెలిగించాడు. నమ్మకం అనే పూలతో ఇంటిని అలంకరించాడు. కానీ ఒక మోసగాడు అన్నీ దొంగిలించుకుని పోయాడు. హృదయం పగిలిపోయింది. ఇక బ్రతికి ఏం లాభం. ఇదీ నాయకుడి విషాద స్వరూపం.

**బహార్ అయీథి కిస్మత్ నే**

**మగర్ యే గుల్ ఖిలాయా**

**జలాయా ఆషియా సయ్యాద్ నే**

**పర్ నోచ్ డాలే..**

**ముఝ్ కో ఏయే మాలిక్ ఉఠాలే**

వసంతం వచ్చింది అదృష్టం ఇలాంటి పూలు పూయించింది.ఇంటిని కాల్చేశారు. వేటగాడు రెక్కలను విరిచేశాడు. . 'నోచ్ డాల్నా' అంటే పీకేయటం అన్న అర్థం వస్తుంది..పర్ అంటే రెక్కలు.. ఇక్కడ రెక్కలు విరిచేయటం అని అర్థం. ఇక నాకు ఈ ప్రపంచంలో ఉండాలని లేదు, దేవుడా నన్ను తీసుకుపో అని హీరో బ్రతిమిలాడుతున్నాడు 'తేరి దునియామే' పాటలో. జరిగింది స్పష్టంగా తెలుస్తోంది. నాయకుడి విరక్తికి కారణం తెలుస్తోంది.

ఉల్ఫత్ కా బద్లా మిల్గయా

వోగమే లుటా,వో దిల్ గయా

చల్నాహి సబ్సే దూర్ దూర్

అబ్ కార్వాన్ కోయీ నహో

ప్రేమించినందుకు ఫలితం దక్కింది. ఆ బాధలేదు. ఆ హృదయం లేదు. అందరినీ వదిలి దూరంగా పోవాలనుంది. వెంట ఎవరూ రావద్దు. ఓ నా హృదయమా, ఎవ్వరూలేని స్థలానికి నన్ను తీసుకుని పో అంటున్నాడు అర్జూ సినిమా హీరో. ఇక్కడ కూడా విషాదానికి కారణం తెలుస్తోంది. ఈ పాటలో నాయకుడి హృదయం ఎంతగా విరిగిపోయిందంటే అందరికీ దూరంగా వెళ్లిపోవాలనుకుంటున్నాడు. వో గం లుటా వో దిల్ గయా...అంటే ప్రేమలో వైఫల్యం వల్లనో, ప్రేయసి చేసిన మోసం వల్లనో ఇప్పుడు నాయకుడి హృదయంలో ప్రేమ బాధలేదు..అసలిప్పుడు ఆ హృదయమేలేదు.

జాకర్ కహీన్ ఖోజావుమైన్,నీంద్ ఆయే ఔర్ సోజావుమైన్

దునియా ముఝే ఢూంఢే, మగర్ మేరా నిషాన్ కోయీ నహో.

వెళ్లి ఎక్కడో దాక్కుంటాను. నిద్రవస్తే పడుకుంటాను. ఇక్కడ నిద్ర మరణం. ప్రపంచం వెతికినా తన గుర్తులు ఒక్కటి కూడా లభించకూడదంటున్నాడు హీరో. అంతగా విరిగిపోయింది అతడి మనసు. ఈ పాటలన్నీటిలో ప్రేమ వైఫల్యం నాయకుడి విరక్తికి కారణం. అది స్పష్టంగా తెలుస్తోంది.

**చల్ జాహో గం కె మారే నహో**

**ఝూటి ఆశా కె తారే నహో**

**ఇన్ బహారోం సె క్యా ఫాయదా**

**జిస్ మె దిల్ కీ కలీ జల్ గయీ**

**జఖ్మ్ ఫిర్ సే హరా హోగయా**

నాయకుడు తాగుబోతు. తను తాగటం వల్ల జరిగే అనర్థం గ్రహిస్తాడు. మారిపోదామనుకుంటాడు. అతడు తాగుబోతు అని అతడు ప్రేమించిన అమ్మాయితో వివాహానికి ఒప్పుకోరు. తాగటం మానేయాలనుకుంటాడు. కానీ తాగుడు ప్రలోభం వదలలేకపోతాడు. అన్నిటినీ నాశనం చేసుకుంటాడు. తాగటం ఎందుకంటే విషాదాన్ని, పేదరికాన్ని మరచిపోవటం కోసం. అందుకే అతడు ఎటు వెళ్లాలనుకుంటున్నాడంటే అక్కడ బాధదెబ్బతిన్నవాళ్లుండని చోటు.గం కే మారే అంటే బాధదెబ్బతిన్నవాళ్ళు, బాధతో మరణించినవాళ్ళు అన్న అర్థాలొస్తాయి. నిజానికి గం కే మారే అంటే బాధచేతిలో ఓడిపోయి సర్వం కోల్పోయినవాళ్ళు అన్న అర్థం కూడావుంది. అక్కడ అబద్దపు ఆశల తారలుండవు. హృదయపు పుష్పం కాలిపోయేటటువంటి వసంతాలు ఉండేం లాభం. జఖ్మ్ అంటే గాయం. హరా అంటే పచ్చదనం. గాయం మళ్ళీ తాజా అయ్యిందన్నమాట. అంటే గాయాన్ని రేపటం. అతడు తాగుడు మానేయాలనుకున్నాడు. కానీ మళ్ళీ తాగించారు. నష్టపోయాడు. గాయం తిరిగి రేగింది. కాబట్టి ఈ ప్రపంచం వదిలి మరో చోటకి పోదాం. కొత్త ఇల్లు, అంటే కొత్త ఆశలు, నిర్మించుకుందాం అంటున్నాడు హీరో తన హృదయంతో. అంటే విషాదంలోనూ 'ఆశ' విరక్తిలోనూ కోరికను చూపుతున్నాడన్న మాట కవి. ఇది శైలేంద్ర రచన పద్ధతి. ప్రపంచరీతిని, నియమాలను ఒప్పుకుంటాడు. కానీ ఆ పరిమితులలోనే ఆశను చూస్తాడు. కొత్త జీవితం ప్రారంభిస్తాడు. ఇలా విషాదంలో కూడా ఒక ఆశను చూస్తాడు శైలేంద్ర తన గేయాల ద్వారా.

**కోయీతోఐస ఘర్ హోతా**

**జహాసే ప్యార్ మిల్ జాతా**

**వొహీ బేగానె చెహెరే హై**

**జిధర్ సేభీ గుజర్ జాయే**

ఇది సాహిర్ విరక్తి. ఇది ప్రేమ వైఫల్యం విరక్తికాదు. ప్రేమ రాహిత్య భావనవల్ల కలిగిన విరక్తి. ప్రేమ దొరుకుతుందేమోననుకుంటే, అవే మొఖాలు. అవే అపరిచితమైన మొఖాలు ఎటుపోయినా కనిపిస్తున్నాయట. అందుకని నీ ప్రపంచంలో బ్రతికే కన్నా చావటం మేలు అంటున్నాడు సాహిర్.

ఈ చరణంలో పైకి కనిపించే అర్థాన్ని దాటి లోతుకు వెళ్తే, ప్రేమ రాహిత్యం స్పష్టంగా తెలుస్తుంది. ఈ ప్రపంచంలో మనుషులు కలుస్తారు. కలిసి జీవిస్తారు. కానీ ఎంత సన్నిహితంగా ఉన్నట్టు అనిపించినా ప్రతి వ్యక్తి మరో వ్యక్తికి అపరిచితుడే. సాన్నిహిత్య భావన డొల్ల భావన. ఎవరూ ఎవరికీ ఏమీ కారు. పైకి అందరూ ప్రేమ నటిస్తారు. కానీ ఎవరికి వారు స్వార్థపరులు. తమ విషయం తప్ప మరొకటి పట్టదు. ఇది ప్రపంచం రీతి. యాజ్ఞవల్క్యుడు, గార్గికి చెప్పినట్టు ఈ ప్రపంచంలో స్వార్థం తప్పించి మరొకటి లేదు. 'వహీ బేగానె చెహెరే హై' వెనుక ఇంత అర్థం ఉంది. అందుకని ఈ ప్రపంచంపై విరక్తి కలిగింది హీరోకి. ఇది సాహిర్ విరక్తి.

బాల్యం నుంచీ సాహిర్ మనుషులు స్వార్థం చూస్తూ పెరిగాడు. అతడికి ప్రేమ అన్నా మానవ సంబంధాలన్నా నమ్మకం లేదు. అందుకే అతడు ప్రేమలో విరక్తి చెందటాన్ని గురించి రచించడు. ప్రేమ రాహిత్య భావంతో తపిస్తూ స్వచ్ఛమైన నిస్వార్థ భావన లేదీ ప్రపంచంలో అని బాధ పడే పాటలు రచిస్తాడు.

దర్ద్ హమారా కోయీన జానే

అప్ ని గరజ్ కే సబ్ హై దివానే

కిస్ కే ఆగే రోనా రోయే

దేశ్ పరాయా, లోగ్ బేగానే

ఇది 'ఫంటూష్' పాటలో చరణం. మన భాధ ఎవరికీ అర్ధంకాదు. తెలియదు. ఎవరి స్వార్ధం వాళ్లది. ఎవరి పిచ్చి వాళది. ఎవరికీ బాధ చెప్పుకోలేము. ఎందుకంటే పరాయి దేశం , అంతా అపరిచితులు. ఇక్కడ దేశం, పరిచితులు వంటివన్నీ అత్యంత లోతైన భావం కల ప్రతీకలు. ఇది హీరో విషాదం. పేమ వైఫల్యం కాదు అతడి విరక్తికి కారణం. ప్రేమ రాహిత్య భావన. ఎవరూ తనని అర్ధం చేసుకోలేరు. ఎవరికీ తన బాధ అర్ధం కాదు. అవసరంలేదు. ఎవరి ఏడుపు వాళ్లది. కాబట్టి ఇక్కడ శాంతి లేదు. శాంతిలేని చోట ఉండకూడదు. కాబట్టి 'దుఖిమన్ మేరే' నా మాట విను. 'జహా నహీ చైనా వహా నహీ రహెనా' అంటున్నాడు హీరో ద్వారా సాహిర్. మరో సందర్భంలో 'సబ్ కో అప్నీ భి కిసీ బాత్ పె రోనా ఆయా' అంటాడు. అంటే ఎవరి ఏడుపు వాళ్లకి ఉంది. ఎవరు ఎవరిని పట్టించుకుంటారు. అందుకే 'తెరీ దునియామె మె జీనేసే బెహతర్ హై కె మర్ జాయే' అంటున్నాడు సాహిర్.

అంటే, సినీ సందర్భ పరిధిలో ఒదుగుతూనే గేయ రచయితలు తమ ఆలోచనలను, వ్యక్తిత్వాలను, ఆశలను, నిరాశలను, సిద్ధాంతాలను పాటల్లో ఒలికించారు. పాత్రల ద్వారా పలికించారు. పాటల ద్వారా ప్రజలకు చేరువ చేసి, ప్రజలకు ఒక దృక్కోణాన్ని, అవగాహనను అందించారు. వాటిని అనుభవించిన ప్రజలు తమని తాము తెలుసుకుని, ఆశాదీపాలు వెలిగించుకుని ముందుకు సాగుతారన్నమాట. ఇదీ సినిమాలోని విషాద పాటలు, ఇచ్చే స్ఫూర్తి. హోమియోపతి వైద్య విధానంలో రోగ లక్షణాన్ని పెంచే మందును ఇవ్వటంద్వారా రోగాన్ని నియంత్రించి, రోగ నిరోధక శక్తిని పెంచుతారు. సినిమాల్లో విషాద పాటలు చేసేది అదే. వ్యక్తిలోని విషాద భావనకు రెక్కలనిచ్చి, ఎంతగా విషాదాన్ని పెంచుతాయంటే, విషాద భావన స్వరూపం అవగాహనకు వచ్చిన వ్యక్తి విషయంలో ఆనందాన్ని అనుభవిస్తూ, ఆనందాన్ని పెంచుకోగలుగుతాడన్నమాట. తనతోపాటు ఏడ్చి, తన బాధకు స్పందించి కన్నీరు తుడిచే విషాద గీతాలు ఆలంబనగా, ఆశవైపు ప్రయాణిస్తాడన్నమాట.

**అరెవో ఆస్మాన్ వాలే బతా ఇస్ మే బురా క్యాహై**
**ఖుషీకే చార్ ఝోంకే అగర్ ఇధర్ సే భీ గుజార్ జాయే.**

'ఓ దేవుడా, కొన్ని సంతోష వీచికలు ఇటువైపు వీస్తే తప్పేంటి?' అని దేవుడిని నిలదీసి ప్రశ్నించే నిబ్బరాన్ని సాధిస్తాడు. ప్రపంచంలో బ్రతకటం కన్నా చావు మేలు అంటూనే ప్రపంచంలో ఆనందాన్ని ఆస్వాదించేందుకు ఉవ్విళ్లూరుతు సాగుతాడు.

**(వచ్చే నెల మరిన్ని మధురమైన గీతాలు)**

Post your comments